

## నాలుగు చెవుల పిల్లి

తమ ఆహార సంపాదనలో పిల్లి ఎన్నో జిమ్మిక్కులు చేస్తుంది. ఎలుకలు ఎంత చప్పుడు చేసినా ఏమీ ఎరగనట్టు ఉంటుంది. గబుక్కున వాటిని నోటకరచుకుని తన ఆకలిని తీర్చుకుంటుంది. అలాంటి పిల్లికి నాలుగు చెవులుంటే ఎలా ఉంటుంది. అమెరికాలో అచ్చం అలాగే నాలుగు చెవులతో ఓ పిల్లి కూన జన్మించింది. అక్కడి జనం ఈ పిల్లిని ఎంతో విచిత్రంగా చూస్తున్నారు. ఈ పిల్లిని పెంచుకుంటున్న వారు మాత్రం ఇలా నాలుగు చెవుల పిల్లి చూడడానికి ఎంతో బావుందని పేర్కొంటున్నారు. కలియుగంలో ఇలాంటి విచిత్రాలు మామూలేనని నాస్తికులు కొట్టి పారేస్తుంటే, ఆస్తికులు మాత్రం త్వరలో ఏదో జరగబోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ నాలుగు చెవుల పిల్లి మాత్రం వార్తల్లోకి వచ్చేసింది.

## భర్త సాయం!

మీరు వేగంగా రోడ్డు మీద వెళుతూ ఉంటారు. ఎవరికో యాక్సిడెంట్ అయి జనం అంతా పోగై వుంటారు. మీరేమో త్వరగా ఆఫీసుకో, మరెక్కడికో వెళ్లే హడావిడిలో వుంటారు. ఆ యాక్సిడెంట్ గురించి అంతగా పట్టించుకోరు. ఆ యాక్సిడెంట్‌లో మీ మిత్రులో, మీ సన్నిహితులో ఎవరైనా చిక్కుకుని ఉంటే మీ ప్రతిస్పందన ఎలా ఉంటుంది? ఇలాంటి సంఘటనే ఓ ఆసామికి ఎదురైంది. ఇంగ్లండ్ లోని ట్వికిన్‌హామ్ రగ్బీ క్లబ్‌కి చెందిన జేమ్స్ పీటర్స్ తన పని ముగించుకుని ఇంటికి బయలు దేరాడు. కొన్ని గంటలముందే ఆయన తన భార్యని ఇంటి దగ్గరలో వున్న బస్టాప్‌లో డ్రాప్ చేశాడు. సాయంత్రం తన పని ముగించుకుని వచ్చేసరికి రోడ్డు మీద ఒకావిడ రోడ్డు ప్రమాదానికి గురైంది. వెంటనే స్పందించి ఆమెని తన కారులో ఎక్కించుకుని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించాడు. ఇక్కడే అసలు కథంతా వుంది. అతను ఆస్పత్రికి తీసుకెళ్ళింది కాపాడింది ఎవరినో కాదు, ఉదయం బస్టాప్‌లో దింపేసిన తన భార్యనేన చాలాసేపటి తర్వాత గానీ అతనికి అర్థం కాలేదు. అసలు సంగతి ఏంటంటే జేమ్స్ పీటర్స్ భార్య ఇంటికి వెళ్ళకుండా దగ్గరలో వున్న హెయిర్ డైయింగ్ షాప్‌కి వెళ్లడం, అక్కడ తన కురులకు డైయింగ్ వేసుకుని అలాగే రోడ్డుమీదికి వచ్చేసింది. వేగంగా వస్తున్న ఓ కారు ఆమెని ఢీకొట్టి వెళ్లిపోయింది. చివరికి భర్త సాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తనువు చాలించింది. ఈ సంఘటనకి కొన్ని రోజుల క్రితమే ఆ జంట తమ నలభైయ్యావ వివాహ వార్షికోత్సవం జరుపుకుంది. కష్టసుఖాల్లో ఇద్దరూ చేదోడు వాదోడుగా వున్న ఆ జంట ఇలా విడిపోవడం చాలా బాధించింది. 'ఆ జంట చాలా అన్యోన్యంగా ఉండేవారు' అని ఆమె బంధువులు. చుట్టుపక్కలవారు పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన 28 ఏళ్ళ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

'సరసి'కత

# పంక్చర్

వైశంపాయనుడు గారికి చిన్నపుడు సినిమాల పిచ్చి బాగా వుండేది. కాలేజీ ఎగ్గొట్టయినా సరే, కొత్త బొమ్మ రిలీజు నాడు చూసెయ్యాల్సిందే!

సాయంత్రం ఇంటికి లేటుగా వచ్చిన కొడుకుని, ''ఎందుకు లేటయింది రా?'' అని నిలదీశాడు తండ్రి గుమ్మంలోనే కాపు కాసి. ''సైకిల్ పంక్చ రైంది,'' అప్పటికే సిద్ధం చేసుకున్న అబద్ధం జవాబుగా వచ్చింది. పైగా ''ఫ్రెండు దగ్గర నాలుగు రూపాయలు అప్పు చేశా. రేపిచ్చెయ్యాలి,'' అంటూ తండ్రీ దగ్గర నాలుగు రూపాయలు వడికేశాడు వైశంపాయనుడు.

మర్నాడు ఎన్టీఆర్ సినిమా రిలీజైతే దానికీ చెక్కేశాడు కాలేజీకి ఎగనామం పెట్టి. చీకటి పడ్డాక చేరుకున్న కొడుకుని యధాప్రకారం




ప్రశ్నించాడు తండ్రి. ''సైకిల్ పంక్చరైంది,'' అన్నాడు వైశంపాయనుడు తడుముకోకండా. తండ్రికి వొళ్లు మండిపోయింది, ''వెధవ్వేషా లేస్తున్నావా? నిన్ననేగా పంక్చరైందన్నావ్?''

''నిన్న ఐతే ఈ వేళ మళ్లీ కాకూడదా? పంక్చరనేది ఎప్పుడైనా కావచ్చు. ఎన్నిసార్లయినా కావచ్చు. రోడ్లు అలా వున్నాయి మరి. కావాలంటే సైకిల్ షాపువాణ్ణడుగు,'' అంటూ మళ్లీ నాలుగు రూపాయలు వసూలు చేసి పట్టుకుపోయాడు వైశంపాయనుడు.

ఆ రోజు నించి కొడుకు ఎంత లేటుగా వచ్చినా అడిగేవాడు కాదు తండ్రి. అడిగితే, అడిగిన పాపానికి నాలుగు రూపాయల ఫైను కట్టుకోవాల్సొస్తుంది మరి!

★